సంక్షేమ సారథులు వలంటీర్లు



ఇచ్ఛాపురం రూరల్: కొఠారీలో వలంటీర్లను సత్కరిస్తున్న సర్పంచ్ ధనలక్ష్మి



ఇచ్ఛాపురం: వలంటీర్లకు సత్కరిస్తున్న వార్డు కౌన్సిలర్లు



సోంపేట: వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ నిమ్మన దాస్ తదితరులు

సోంపేట: వలంటీర్లు ప్రజలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని సోంపేట ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. కర్తలిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం వలంటీర్ల వందనం కార్యక్రమం నిర్వహించారు. కర్తలిపాలెం, పాత్రకొండ, పాలవలస సచివాలయం పరిధిలోని వలంటీర్లలో సేవావజ్ర, సేవా రత్న, సేవామిత్రలగా ఎంపికైన వారిని దుశ్శాలువలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వలంటీర్లు మరింత అంకితభావంతో సేవలందించి ప్రభుత్వానికి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బెందాళం వెంకటరమణ, పీఏసీఎస్ అధ్యక్షుడు రౌతు విశ్వనాథం, పాలవలస ఎంపీటీసీ దుమ్ము రూపావతి, కర్తలిపాలెం సర్పంచ్ పొందూరు గున్నయ్య, పార్టీ నాయకులు దుమ్ము డిల్లీ, మర్ల శంకరరావు, గోపయ్య, బేసి శ్యాం, ధర్మారావు, కె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: సంక్షేమ రథసారథులు గ్రామ వలంటీర్లని సర్పంచ్ దుక్క ధనలక్ష్మి అన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కొటారీ గ్రామ సచివాలయంలో వలంటీర్లను సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అటు ప్రభుత్వానికి, ఇటు ప్రజలకు వారధిలా పని చేసే వలంటీర్లు నిజమైన సంఘ సేవలకులని పేర్కొన్నారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, నాయకుడు దుక్క ఆనంద్ పాల్గొన్నారు.

కవిటి: కరోనా వైరస్ వంటి విపత్కర పరిస్థితుల్లోనూ సాహసోపేతమైన సేవలందించిన గ్రామవలంటీర్ల సేవలు అమోఘమని సర్పంచ్ పూడి లక్ష్మణరావు అన్నారు. కవిటి మేజర్ పంచాయతీ సచివాలయంతో పాటు, ఆర్.బైరిపురం పంచాయతీలో వలంటీర్లకు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు,

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం 4, 23 సచివాలయాల్లో వార్డు కౌన్సిలర్ల ఆధ్వర్యంలో వలంటీర్లను సన్మానించారు. అనంతరం ప్రశంసాపత్రాలు అందజేశా. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు గువ్వాడ ప్రదీప్, గేదెల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కవిటి: కవిటిలో వలంటీర్లను సన్మానిస్తున్న సర్పంచ్ లక్ష్మణరావు



కవిటి: ఆర్.బైరిపురంలో వలంటీర్లను సత్కరించిన దృశ్యం

ప్రతి గడపకూ సంక్షేమం జగనన్నతోనే సాధ్యం

- గడప గడపకూ మన ప్రభుత్వంలో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

కంచిలి: రాష్ట్రంలో ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందించడం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. కంచిలి సచివాలయం పరిధిలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం ద్వారా అయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. వారికేం కావాలో అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. జగనన్న నాయకత్వంలోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, ఎంపీపీలు పైల దేవదాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గుమ్మిడి రామదాసు, ఎంపీటీసీ సభ్యుడు దుర్గాసి మాధవరావు, సర్పంచ్ గణప సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



మఠం కంచిలిలో లబ్ధిదారుతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

తాగునీటి సౌకర్యానికి ప్రాధాన్యం



తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

కంచిలి: అన్ని జనావాస ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యానికి ప్రాధాన్యమిస్తున్నట్లు ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. బొగాబెణి పంచాయతీ యు.బొనమాళి, ఎస్.బొనమాళి, జెన్నాగాయి గ్రామాల్లో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.6లక్షలతో ఏర్పాటు చేసిన మూడు మినీ వాటర్ ట్యాంక్ సిస్టమ్‌లను సర్పంచ్ గణప సింహాచలం అధ్యక్షతన ఎంపీపీ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బొండాడ వైకుంఠరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మిడి రామదాసు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లడ్డుకేశవ పాత్రో, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, జేసీఎస్ కన్వీనర్ కె.సురేష్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సేవలపై ఆరా



స్థానికులతో మాట్లాడుతున్న ఆర్డీఓ సీతారామ్మూర్తి

ఇచ్ఛాపురం రూరల్: బాలకృష్ణాపురం గ్రామ సచివాలయాన్ని పలాస ఆర్డీఓ తమరాల సీతారామ్మూర్తి శుక్రవారం తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న సేవలు, అర్జీల రికార్డులను పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులకే అందించాలన్నారు. అనంతరం ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ అంబరీష్‌తో కలిసి డెప్పూరు గ్రామాన్ని సందర్శించి ఎస్సీలతో మాట్లాడారు. రవాణా సదుపాయం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని అధికారుల దృష్టికి తెచ్చారు. మండల పరిషత్ నిధులతో రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ కె.రామారావు హామీ ఇచ్చారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా వచ్చే అభివృద్ధి నిధులను గ్రామానికి కేటాయించాలని గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ సదాశివుని గురుప్రసాద్, ఆర్ఐ శ్రవణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశానవాటికను సర్వే చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘ ప్రతినిధులు

ఇచ్ఛాపురం: క్రైస్తవుల శ్మశాన వాటిక కోసం వల్లప రాయ గెడ్డ వద్ద ప్రభుత్వం కేటాయించిన భూమిని సర్వేచేసి హద్దులు వేయాలని క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్ కోరారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ గురుప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. మండల పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో 2018లో ప్రభుత్వం కేటాయించిన 177/పి సర్వే నంబర్ గల ఎకరా భూమిని క్రిస్టియన్ శ్మశానవాటికకు కేటాయించారని, భూమిని సర్వేచేయించి మ్యాపింగ్ చేసి ఎటువంటి ఆక్రమణలకు గురికాకుండా చూడాలని విన్నవించారు. కార్యక్రమంలో పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు డి.ఎలియా, సుందర్‌రాజు, మద్ది పాల్, బిమ్మో తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి సాయం



సాయం అందిస్తున్న సంఘ సభ్యులు

టెక్కలి: పట్టణంలో పలువురు నిరుపేద కుటుంబాలకు అభయం యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. స్థానిక గోపీనాథపురం గ్రామానికి చెందిన ఆళ్ల హరికృష్ణ ఇటీవల ప్రమాదానికి గురి కావడంతో ఆ కుటుంబానికి రూ.6వేలు, మేద రవీధికి చెందిన పిల్లి జగ్గారావు ప్రమాదంలో గాయపడడంతో ఆ కుటుంబానికి రూ.6 వేలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవాది శ్రీనివాసరావు, పి.రమేష్, బి.నాగరాజు, డి.శ్రీను, ఆర్.ఈశ్వరరావు, ముక్తేశ్వర్‌దాస్ పాల్గొన్నారు.

అమ్మకు వందనం

ఇచ్ఛాపురం: స్థాని శాంతినికేతన్ పాఠశాల ఆవరణలో శుక్రవారం అమ్మకు వందనం కార్యక్రమం నిర్వహించారు. తల్లుల పాదాలకు చిన్నారులు ప్రత్యేకంగా పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందుకున్నారు. అనంతరం టెన్త్ టాపర్లను సత్కరించారు. పాఠశాల చైర్మన్ దక్కత కృష్ణమూర్తి అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అసిరమ్మ తల్లి సంబరాలు



అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: తేలుకుంచిలో జరుగుతున్న గ్రామ దేవత అసిరమ్మతల్లి సంబరాలు అంబరాన్ని తాకుతున్నాయి. శుక్రవారం అమ్మవారిని ప్రత్యేక జంగిడిలో మేళతాళాలు మధ్య ఊరేగించారు. ఈ సందర్భంగా ఒడిశా గారడీ, విశాఖపట్నం కోలాటం నృత్యాలు ఆహూతుల్ని అలరించాయి.

తప్పిన ప్రాణాపాయం



తేరుకుంటున్న యువకుడు

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు చిన బాడాం గ్రామానికి చెందిన నిమ్మకాయల పండు అనే యువకుడుకు శుక్రవారం విషపూరిత పాము కరవడంతో అత్యవసర పరిస్థితిలో పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. వైద్యులు డాక్టర్ చిన్నంనాయుడు సత్వరమే వైద్యసేవలు అందించడంతో ప్రాణాపాయం తప్పింది. ఖరీదైన ఇంజక్షన్‌లు అందుబాటులో ఉండటంతో యువకుడిని కాపాడగలిగామని తెలిపారు. యువకుడిని పట్టణ సచివాలయాల కన్వీనర్ బడగల బళ్లయ్యనాయుడు, నాయకులు పరామర్శించారు.

బాల సాహిత్య సమ్మేళనంలో కూర్మారావు



కళింగ సీమ జానపద కళలు పుస్తకం పరిచయం చేస్తున్న బద్రి కూర్మారావు

పలాస: తెలంగాణా సారస్వత పరిషత్ ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన రెండు రోజుల బాల సాహిత్య సమ్మేళనంలో జానపద పరిశోధకుడు, రచయిత బద్రి కూర్మారావు పాల్గొన్నారు. పలాస మండలం రంగోయి గ్రామానికి చెందిన ఈయన సదస్సులో బాలసాహిత్యాన్ని పిల్లలకు చేర్చవలసిన పద్ధతులు, ప్రస్తుతం బాలసాహిత్యం పరిస్థితిపై మాట్లాడారు. సెల్‌ఫోన్ల ప్రభావంతో పిల్లల్లో పఠనాసక్తి తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల్లో నైతిక విలువలు పెంచే విద్య అవసరమని చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, పద్మభూషణ్ డాక్టర్ కె.ఐ.వరప్రసాదరెడ్డి, డాక్టర్ కె.వి.రమణాచారి, దేశపతి శ్రీనివాస్, కార్యదర్శి జె.చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సాయినాథ్

వజ్రపుకొత్తూరు: ఉద్దానం రామకృష్ణాపురంలో ఉద్దానం హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ ప్రాంతంలో కోవిడ్-19 తరువాత ఎక్కువ మంది కిడ్నీ , క్యాన్సర్, గుండెపోటు వ్యాధులకు గురై తమ ప్రాణాలను కోల్పోతున్న దృష్ట్యా వైద్య శిబిరం ఏర్పాటు చేశామని సొసైటీ వ్యవస్థాపకులు కీలు విజయ్‌కుమార్ తెలిపారు. వైద్యులు డాక్టర్ సాయినాథ్, దివ్య ఆధ్వర్యంలో 250 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి శస్త్ర చికిత్స చేయించుకోవాలని ఆస్పత్రులకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చింత హేమారావు, ఉద్దానం హెల్పింగ్ సొసైటీ సభ్యులు, వైద్య సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల పనితీరు మెరుగుపడాలి



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ చిట్టిరాజు

కోటబొమ్మాళి: ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల పనితీరు మెరుగుపడాలని, ప్రజా ప్రతినిధుల సూచనలతో పనులు చేపట్టాలని డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు అన్నారు. శుక్రవారం కోటబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగునీటి కాలువ పనులు సత్వరమే పూర్తి చేయాలన్నారు. రికవరీ బకాయిలు చెల్లించాలన్నారు. అంతకుముందు కొత్తపేట బంద చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను పీడీ పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దుబ్బ వెంకటరావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు రోణంకి మల్లయ్య, ఏపీడీ మురళీకృష్ణ, డ్వామా జేఈ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా పారిశుధ్యం



ఉదయపురంలో రోడ్డుపైకి వచ్చిన చెత్త

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఉదయపురం సచివాలయం పరిధిలో కాలువలు పూడికలతో నిండిపోయాయి. చెత్తచెదారా రోడ్లపైకి వచ్చేస్తున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడంతో కొద్దిపాటి వర్షానికే రోడ్డు చెత్తమయంగా మారుతోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. కేటీ రోడ్డు, లేబరుకాలనీ, పాతజాతీయ రహదారి, మూడు రోడ్ల కూడలి, డెంకివీధి, ఎస్సీ వీధిలోనూ ఇదే పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రామకమిటీల నియామకం చేపట్టాలి

వజ్రపుకొత్తూరు: గ్రామ కమిటీల నియామకం చేపట్టాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొర్రాయి బాలకృష్ణ పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ మేరకు శుక్రవారం కొత్తపేటలో వజ్రపుకొత్తూరు బీజేపీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. బీజేపీ జిల్లా మత్స్యకార సెల్ అధ్యక్షుడు గుంటు ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రాయితీపై విత్తనాలు



రైతులకు విత్తనాలు అందజేస్తున్న ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్

సోంపేట: ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా 50 శాతం రాయితీతో అందజేస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ మండల కమిటీ అధ్యక్షుడు, పలాసపురం సర్పంచ్ తడక జోగారావు కోరారు. పలాసపురం రైతు భరోసా కేంద్రం వద్ద శుక్రవారం పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు జీవిత తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



నారాయణ కుటుంబానికి సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

సోంపేట: మండలంలోని నడుమూరు ఉన్నత పాఠశాలలో 2005 బ్యాచ్ టెన్త్ పూర్వ విద్యార్థులు తోటి స్నేహితుడు, గొల్లూరు గ్రామానికి చెందిన నారాయణ కుటుంబానికి రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. నారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో నారాయణ తల్లిదండ్రులకు ధైర్యం చెబుతూ శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

టెక్కలి రూరల్: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని అటవీ శాఖాధికారి వై.సంజయ్ అన్నారు. శుక్రవారం నర్సింగపల్లి పంచాయతీ సవరకిల్లి గ్రామంలో మిషన్ లైఫ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కల పెంపకం వల్ల సకాలంలో వర్షాలు పడతాయని, వాయు కాలుష్యం తగ్గి వ్యాధులు దరి చేరవని తెలిపారు. కార్యక్రమంలో అటవీ శాఖాధికారి రెడ్డి, ఎఫ్‌బీఓ ఝాన్సీ, ఏబీఓ గీత, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా శీతలషష్ఠి మహోత్సవాలు



పార్వతీ, పరమేశ్వరులను పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని బొడ్డబడ గ్రామంలో శీతల షష్ఠి మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. గురువారం రాత్రి పార్వతీ, పరమేశ్వరులకు శాస్త్రోక్తంగా పండితులు కల్యాణం జరిపించారు. తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ లిట్టుపాడి తెలిపారు. శుక్రవారం స్వామివారిని మేళతాళాలతో పల్లకిలో ఊరేగించారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం



గీతకు ఆర్థికసాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

కాశీబుగ్గ: పలాస మండలం బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2003 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు తోటి స్నేహితులకు అండగా నిలుస్తున్నారు. కష్టాల్లో ఉన్న మద్దిల జోగారావుకు ఇటీవల రూ.10 వేలు ఆర్థికసాయం అందించగా, తాజాగా మరో మిత్రురాలు బైనపల్లి గీతకు రూ.10 వేల ఆర్థికసాయం అందించి ఆదుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తామాడ ఈశ్వరి, మెట్టూరు కమల, బొడ్డు సంధ్య, రాజాం స్వరాజ్యం, పోతనపల్లి లలిత, మద్దిల కైలాష్, పోతనపల్లి సింహాచలం, నాయనోరు కేశవరావు, పత్తిరి తాతారావు, గేదెల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


మౌలిక వసతుల కల్పనే ధ్యేయం



భూమిపూజ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని సర్పంచ్ గూడ గిరిజ అన్నారు. గరుడబద్ర పంచాయతీ పరిధిలోని తర్లాగడూరులో శుక్రవారం జలజీవన్ మిషన్‌లో భాగంగా మంచినీటి బోరుకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గూడ ఈశ్వరరావు, కె.యోగీశ్వరరావు, కె.ప్రకాశ్, కె.సోమేష్, కేశవరావు, వై.పాపారావు, కె.తాతారావు, రవి తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్ షెడ్‌కు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ

కంచిలి: మండల కేంద్రం కంచిలిలో 108 అంబులెన్స్ వాహనం నిలిపి, సిబ్బంది విశ్రాంతి తీసుకోవడానికి అవసరమైన భవన నిర్మాణానికి ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి శుక్రవారం భూమిపూజ చేశారు. భవన నిర్మాణం కోసం ప్రభుత్వం 2 సెంట్లు కేటాయించినట్లు ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్.హైమావతి, ఎంపీడీఓ సీహెచ్.శ్రీనివాస రెడ్డి, పశువైద్యాధికారి టి.శిరీష, ఏపీఓ జి.ధనుంజయ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దేవాలయాలు ధార్మిక కేంద్రాలు



చక్రధరస్వామిని దర్శించుకున్న స్వామి కమలానందభారతీ

కవిటి: హిందూ దేవాలయాలు సనాతన ధర్మాన్ని, ఆచార వ్యవహారాల్ని భావితరాలకు సురక్షితంగా అందించే ధార్మిక కేంద్రాలని గన్నవరం మండలం వనేశ్వరీపీఠం అధ్యక్షులు స్వామి కమలానంద భారతీ అన్నారు. రాష్ట్రంలో దేవాలయాల పర్యటనలో భాగంగా శుక్రవారం చక్రధర పెరుమాళ్‌స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయాల చరిత్ర, సంస్కృతి పరిరక్షణ ఆవశ్యకత అనే అంశంపై మాట్లాడారు. జీవనాన్ని సన్మార్గంలో మలుచుకోవాలన్నారు. ఆధునిక జీవనంలో ఉన్న దుష్పరిణామాలకు దేవాలయాల సందర్శన, ఆధ్యాత్మిక వికాసాన్ని పెంపొందించే రామాయణం, భారతం, భాగవతం , భగవద్గీత వంటి గ్రంథాల్ని పారాయణ చేయాలన్నారు.